## తిమ్మాపూర్‌లో రోడ్డు ప్రమాదం

**ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు**

**బలగం టీవీ, తిమ్మాపూర్**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వెళ్తున్న థార్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టు గోడను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది.

స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న థార్ వాహనం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల సమీపానికి చేరుకోగానే వేగ నియంత్రణ కోల్పోయి డివైడర్ పక్కనున్న కల్వర్టు గోడను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంలో ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, మృతుడు మరియు గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ‘దివ్య భారత్’ పుస్తకంలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి విశిష్ట స్థానం

**జగిత్యాల జిల్లా గర్వకారణం.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆధ్యాత్మిక కేంద్రం**

**బలగం టీవీ, జగిత్యాల**



జగిత్యాల జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచే కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల జాబితాలో స్థానం సంపాదించింది. నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన “దివ్య భారత్” పుస్తకంలో ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి ప్రత్యేక స్థానం లభించడం విశేషంగా నిలిచింది. కొండల నడుమ పచ్చని ప్రకృతి సోయగాల మధ్య విరాజిల్లుతున్న కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం హనుమాన్ భక్తులకు ఆధ్యాత్మిక శక్తి ప్రసాదించే కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. పురాణ గాథల ప్రకారం సంజీవని పర్వతంలోని ఒక భాగం ఈ ప్రాంతంలో పడిందనే విశ్వాసం భక్తుల్లో ఉంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దర్శించుకునే ఈ ఆలయం తెలంగాణలో అత్యంత ప్రాచుర్యం పొందిన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

“దివ్య భారత్” పుస్తకంలో చోటు దక్కడం ద్వారా ఆలయానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు, కేంద్ర నిధులు కూడా వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. స్థానిక ప్రజలు, భక్తులు ఈ పరిణామంపై హర్షం వ్యక్తం చేస్తూ.. ఆలయ అభివృద్ధికి ఇది మరింత ఊతమివ్వనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండగట్టు ఆలయానికి లభించిన ఈ గుర్తింపు రాష్ట్రానికి గౌరవకారణమని అభిప్రాయపడుతున్నారు.

ఈ సందర్భంగా ఆలయ ఈవో అంజనా రెడ్డి మాట్లాడుతూ.. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం “దివ్య భారత్” పుస్తకంలో చోటు సంపాదించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబులెన్స్‌లో క్షేమంగా ప్రసవం

- **సమయస్ఫూర్తి చాటుకున్న 108 సిబ్బంది..**

**బలగం టీవీ,గంభీరావుపేట:**



ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే 108 సిబ్బంది మరోసారి తమ మానవత్వాన్ని, సమయస్ఫూర్తిని చాటుకున్నారు. గంభీరావుపేట మండలం గజసింగారం గ్రామానికి చెందిన గర్భిణి సంపంగి హరీషకు పురిటి నొప్పులు రావడంతో, కుటుంబ సభ్యులు తక్షణమే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది, బాధితురాలిని ఆసుపత్రికి తరలించే మార్గమధ్యలోనే హరీషకు నొప్పులు తీవ్రమవ్వడంతో పరిస్థితి ఒక్కసారిగా విషమంగా మారడంతో, ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదమని గుర్తించిన ఈఎంటీ చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. అంబులెన్స్‌లోనే అందుబాటులో ఉన్న వైద్య పరికరాల సహాయంతో సురక్షితంగా ప్రసవం చేశారు. హరీష పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం వారిని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది వెల్లడించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బిడ్డను, మనవరాలిని కాపాడిన 108 సిబ్బంది సాయికృష్ణ, మనోజ్ ల కి హరీష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవాలి

- **సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి**
- **టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య**
- **హెచ్ యూజే - టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. జర్నలిస్ట్ ల హక్కులను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేసింది. శుక్రవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద హెచ్ యూజే – టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఫెడరేషన్ జెండాను టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డులను ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు కూడా ఇవ్వాలనీ, జర్నలిస్టుల తరపున కంట్రిబ్యూషన్ ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర కార్మిక చట్టాలను రద్దుచేసిన నేపథ్యంలో వేజ్ బోర్డు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనీ, ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమైందన్నారు. లేబర్ కోడ్ ల వల్ల ప్రమాదం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మహారాష్ట్ర, ఢిల్లీ, పంజాబ్ తరహాలో తెలంగాణాలో కూడా ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని సూచించారు. జర్నలిస్ట్ ల సమస్య ల పరిష్కారం కోసం భవిష్యత్ లో ఉద్యమం చేయాలని పిలుపు నిచ్చారు. హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిగ రఘు, రాష్ట్ర కార్యదర్శులు సలీమ, ఈ చంద్రశేఖర్, కే నిరంజన్, హెచ్ యూజే జాతీయ కౌన్సిల్ సభ్యులు చిట్యాల మధుకర్, హెచ్ యూజే ఆఫీస్ బేరర్లు అచ్చిన ప్రశాంత్, తలారి శ్రీనివాస్, ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సైదులు, నాయకులు కృష్ణ, అజయ్, లలిత, రాణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

**వ్యభిచార నిర్వహణ ఆరోపణలు.. మేనేజర్‌తో పాటు ముగ్గురు మహిళలు అదుపులోకి**

**బలగం టీవీ, గుంటూరు**

ఏపీ గుంటూరు నగరంలో స్పా, మసాజ్ సెంటర్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు, రెడ్డిపాలెం ప్రాంతంలో ఉన్న ‘ఐరా స్పా’ సెంటర్‌పై గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు.

విశ్వసనీయ సమాచారం ఆధారంగా సాయంత్రం సమయంలో నిర్వహించిన ఈ దాడుల్లో స్పా సెంటర్‌లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా స్పా మేనేజర్‌గా పనిచేస్తున్న సూర్యతో పాటు ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళల్లో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న నలుగురిని తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. స్పా సెంటర్ నిర్వహణ, కార్యకలాపాలపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు. నగరంలో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని పోలీసులు హెచ్చరించారు.

## కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:

- **పభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **మండేపల్లిలో ఘనంగా మేడే వేడుకలు**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మే డే అనేది కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్మికుల కష్టం, చెమట చుక్కలతోనే సమాజ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చారని, కార్మిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఎం వేగంగా స్పందించారని గుర్తుచేశారు. అలాగే ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ యువతకు నూతన సాంకేతిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. మండేపల్లి, రుద్రంగిలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతాయని పేర్కొన్నారు.



**అర్హులంతా సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన సమానత్వ భావనతో ప్రతి కార్మికుడికి గౌరవం ఇవ్వాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు కార్మిక శాఖలో పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాలు, బీమా సదుపాయాలు పొందాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల కార్మికులతో పాటు మహిళా సంఘాల సభ్యులకు కూడా బీమా సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో ఇందిరమ్మ కుటుంబ బీమా అమలు కానుందని వెల్లడించారు. యువత అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలు, ఉద్యోగులు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ, బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రాచారి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ కవిత, సర్పంచులు సాగర్, రచనలు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం అభివృద్ధికి ప్రభుత్వ చర్యలు

- **ప్రభుత్వ విప్‌ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజలకు మెరుగైన విద్య, నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా బాల భరోసా పై వేములవాడ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని మహిళా, శిశు, దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఈఐసీ కేంద్రంలో 85 మంది పిల్లలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పిల్లలకు చికిత్స అందిస్తుండగా, ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పరిశీలించి..వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని,ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని అన్నారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామనిఅన్నారు . పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్.. అలైవ్ కింద రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారని అన్నారు . త్వరలో ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఇతర ఆసుపత్రుల పరిధిలో అధునాతన వైద్య సేవలు, నూతన బెడ్లు అందు బాటులోకి రానున్నాయని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఆరోగ్యం సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు . ఎదుగుదల లోపించిన



పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు జిల్లాలో అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు, అనారోగ్య బాధితులకు వైద్య సేవలు పొందేందుకు ఎల్‌ఓసీలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. వేములవాడ, ఏరియా ఆసుపత్రి, హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో మాత్రమే మోకాళ్ల ఆపరేషన్లు జరుగుతు న్నాయని అన్నారు . వేములవాడ ఏరియా ఆసుపత్రికి కావలసిన వైద్య పరీక్షల యంత్రాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే వారికి ప్రేమ, గౌరవంతో వైద్య సేవలు అందించాలని సూచించారు.

**ఎదుగుదల లోపించిన పిల్లలకు వైద్య సేవలు**

5 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు సమస్య, సరిగా మాట్లాడాలని పిల్లలు, రక్తహీనత పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు . సేవలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఉన్నత వైద్య సేవలు హైదరాబాద్ లో అందిస్తారని అన్నారు .మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. పిల్లలకు తినడం, ఆడుకోవడం ఇతర అంశాల్లో రాణిస్తారనిఅన్నారు .

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డిప్యూటీ డీఎం హెచ్ ఓ నాగేంద్రబాబు, డీఐఓ నాగేంద్రబాబు, వైద్యులు సంపత్ కుమార్, దివ్య, నయీమా, డిప్యూటీ డెమో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో కర్నూలు యువకుడి ఆత్మహత్య

- **ఉద్యోగం దొరకలేదని మనస్తాపం..**

**తుపాకీతో కాల్చుకుని తనువు చాలించిన చందు**

**బలగం టీవీ, అమరావతి**



ఉన్నత చదువుల కోసం ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన కర్నూలు యువకుడు ఇరగనబోయిన చందు (26) అక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువు పూర్తయినా ఉద్యోగం రాకపోవడం, భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళనతో కఠిన నిర్ణయం తీసుకున్నాడు. ఈ ఘటనతో కర్నూలులో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఘటన వివరాల్లోకి వెళ్తే.. కర్నూలుకు చెందిన చందు షికాగోలోని డీపాల్ యూనివర్సిటీలో ఎంఎస్ (మీా) పూర్తి చేశాడు. చదువు పూర్తయిన తర్వాత గత కొంతకాలంగా అమెరికాలోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే, అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, హెచ్-1బి (ఎ-1దీ) వీసా నిబంధనల్లో మార్పుల వల్ల కొత్తగా చదువు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు లభించడం కష్టతరంగా మారింది.

**ఆర్థిక ఇబ్బందులు.. భవిష్యత్తుపై ఆందోళన**

చాలా కంపెనీల చుట్టూ తిరిగినప్పటికీ ఉద్యోగం లభించకపోవడంతో చందు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. తన ఖర్చుల కోసం మళ్లీ కర్నూలులో ఉన్న తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తోందన్న భావన అతడిని కృంగదీసింది. ఏప్రిల్ 28న ఒంటరిగా ఉన్న సమయంలో తన గదిలోనే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

**స్వగ్రామంలో విషాదం.. తానా సహకారం**


చందు మరణవార్త తెలియగానే కర్నూలులోని అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. చందు భౌతిక కాయాన్ని భారత్‌కు తరలించేందుకు తానా (ాూచీూ) టీమ్ స్క్వేర్ కో-చైర్ చిరంజీవి గల్లాతో పాటు ఇతర ప్రవాస తెలుగు సంఘాలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## అషురెడ్డికి హైకోర్టులో ఊరట

- **నిరాధార వార్తలు ప్రసారం చేయొద్దు..**

**మీడియా, యూట్యూబ్ ఛానళ్లకు కోర్టు ఆదేశం**

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రముఖ సినీ నటి, సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ అషురెడ్డికి తెలంగాణ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. గత కొద్దిరోజులుగా తనపై వస్తున్న వ్యతిరేక కథనాలు, వ్యక్తిగత విమర్శలపై ఆమె చేసిన న్యాయపోరాటం ఫలించింది. అషురెడ్డి వ్యక్తిగత జీవితానికి భంగం కలిగించేలా ఎలాంటి నిరాధార వార్తలను ప్రసారం చేయకూడదని న్యాయస్థానం మీడియా సంస్థలను, కంటెంట్ క్రియేటర్లను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై ధర్మేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో సీసీఎస్ (జజూ) పోలీసులు నమోదు చేసిన కేసు ప్రస్తుతం విచారణలో ఉంది. అయితే, ఈ కేసును సాకుగా చూపి కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికలు తన పరువుకు భంగం కలిగించేలా వార్తలు రాస్తున్నాయని అషురెడ్డి కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఒక వ్యక్తి ప్రైవసీని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేస్తూ, అభ్యంతరకర పోస్టులపై ఆంక్షలు విధించింది.

**చట్టపరమైన చర్యలు తప్పవు: అషురెడ్డి హెచ్చరికలిలి**

కోర్టు తీర్పు అనంతరం అషురెడ్డి ఇన్ స్టాగ్రామ్ వేదికగా స్పందించారు.

తనపై వస్తున్న వార్తలన్నీ కల్పితమని, నిరాధారమైనవని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో ఉన్న అభ్యంతరకర పోస్టులను, వీడియోలను వెంటనే తొలగించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. హెచ్చరిక:లిలి కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇంకా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

**ప్రైవసీ ముఖ్యం..**

తమ టీఆర్పీ రేటింగ్‌ల కోసం ఒక మహిళ వ్యక్తిత్వాన్ని హననం చేయడం సరికాదని అషురెడ్డి ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ, తన ప్రైవసీని గౌరవించాలని మీడియాను కోరారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలతో ప్రస్తుతానికి ఆమెపై జరుగుతున్న నెగటివ్ ప్రచారానికి అడ్డుకట్ట పడినట్లయింది.

## ముఖానికి కేక్ పూశారని ట్రిపుల్ మర్డర్.. ..ప్రధాన నిందితుడు ఎన్‌కౌంటర్

**రూ. 50 వేల రివార్డు ఉన్న జీతూ సైనీ ఖతం.. ఎదురుకాల్పుల్లో ఇద్దరు పోలీసులకు గాయాలు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బులంద్‌షహర్‌లో సంచలనం సృష్టించిన ముగ్గురి హత్య కేసులో ప్రధాన నిందితుడు జీతూ సైనీ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో పోలీసులు అతడిని కాల్చి చంపారు. పరారీలో ఉన్న నిందితుడిపై ప్రభుత్వం గతంలోనే రూ. 50,000 రివార్డు ప్రకటించింది.

పోలీసుల కథనం ప్రకారం.. ధరౌ పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలో స్కూటర్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ కోసం పోలీసులు ఆపగా, వారు ఆగకుండా కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని ఝూజర్ రోడ్డు వద్ద చుట్టుముట్టారు. నిందితులు కాల్పులు కొనసాగించడంతో, పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపారు. ఈ క్రమంలో జీతూ సైనీ తీవ్రంగా గాయపడగా, మరో నిందితుడు చీకటిని ఆసరాగా చేసుకుని తప్పించుకున్నాడు. తీవ్ర గాయాలైన సైనీని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి.

ఈ ఘోరానికి నేపథ్యం వింటే ఎవరైనా షాక్‌కు గురికావాల్సిందే. ఏప్రిల్ 25న ఖుర్జాలో జరిగిన జీతూ సైనీ పుట్టినరోజు వేడుకలే ఈ విషాదానికి వేదికయ్యాయి. వేడుకలో భాగంగా అమర్‌దీప్ (30), మనీశ్ (28), ఆకాశ్ (18) అనే ముగ్గురు యువకులు సరదాగా జీతూ సైనీ ముఖానికి కేక్ పూశారు. ఈ చిన్న విషయంపై ఆగ్రహానికి గురైన సైనీ, వారితో ఘర్షణకు దిగాడు. అనంతరం ఆయుధాలతో తిరిగి వచ్చి, ఆ ముగ్గురిని అతి దారుణంగా కాల్చి చంపాడు.

**పోలీసుల చర్యపై సంతృప్తి**

నిందితుడు ఎన్‌కౌంటర్‌లో హతమవ్వడంపై మృతుల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం కేక్ పూశారన్న కోపంతో ముగ్గురు ప్రాణాలు తీసిన ఉన్మాదికి సరైన శిక్ష పడిందని వారు పేర్కొన్నారు. కాగా, నిందితుల ఆస్తులను కూడా కూల్చివేయాలని (బుల్డోజర్ యాక్షన్) వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా సైనీ నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఘటనా స్థలం నుంచి పోలీసులు ఒక పిస్టల్, బుల్లెట్లు, నంబర్ ప్లేట్ లేని స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

